ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



16న దేశవ్యాప్త సమ్మె

ధర్మవరం, ఫిబ్రవరి 1: డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టం రద్దు కోరుతూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు ట్రాన్స్‌పోర్టు రంగం రాష్ట్ర నేత రవీ పేర్కొన్నారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ స్థానిక కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ప్రమాదాలకు వాహన డ్రైవర్లను బాధ్యులను చేస్తూ పదేళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధించేలా దుర్మార్గమైన చట్టాన్ని రూపొందించారన్నారు. దీనిని నిరసిస్తూ సమ్మె చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

• ఆక్రమించడం.. అమ్మేయడం.. • తలూపుతున్న అధికార గణం.. • రెవెన్యూ కార్యాలయాలు, స్టేషన్ల వైపు బాధితుల పరుగులు

ఊరూరా భూరాబందులు!


వైసీపీ నేతల బరితెగింపు



బుక్కపట్నం సమీపాన అక్రమార్కులు కన్నేసిన ప్రశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్థలం

ఆంధ్రజ్యోతి పుట్టపర్తి

వైసీపీకి మళ్లీ అధికారం వస్తుందో.. లేదోనని ఆ పార్టీ నేతలు బరి తెగిస్తున్నారు. మాఫియాగా ఏర్పడుతున్నారు. గుడి, బడి, ప్రభుత్వ భూములు వేటినీ వదలట్లేదు. రిజిస్టర్డ్ భూములను సైతం వీడట్లేదు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. రాత్రికిరాత్రే గద్దల్లా వాలిపోతున్నారు. బోగస్ పత్రాలతో కబ్జా చేస్తున్నారు. దర్జాగా ఆక్రమించి, అమ్మేస్తున్నారు. వైసీపీ నేతలు చెప్పిన దానికి అధికారులు అడ్డంగా తలూపుతున్నారు. ఆక్రమణను సక్రమంగా మార్చేస్తున్నారు. పేదల భూముల్లో నుంచి వారిని తరిమేస్తున్నారు. వీఆర్వోలు మొదలు తహసీల్దార్ల వరకు అందరినీ గుప్పిట్లో పెట్టుకుని కబ్జా లపర్వం సాగిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నేతలు.. రెవెన్యూ అధికారుల అండ దండలతో పేట్రేగిపోతూ యథేచ్ఛగా భూదందాలకు పాల్పడుతున్నారు. తాజాగా జర్మనీకి చెందిన సత్యసాయి భక్తురాలు పేద పిల్లల కోసం బుక్కపట్నం సమీపాన నిర్వహిస్తున్న ప్రశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌పై అధికార పార్టీ నేతలు కన్నేశారు. రూ.20 కోట్ల విలువచేసే భూమిని నకిలీ పత్రాలతో ముగ్గురి పేర్లతో కాజేయాలని స్కెచ్‌వేశారు. విదేశీయురాలు.. పుట్టపర్తి ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నేతల భూదాహానికి అడ్డూఅదుపులేకుండపోతోంది. ఈనేపథ్యంలో తమ భూములపై భూరాబందులు ఎక్కడ వాలిపోతాయోనన్న ఆందోళన జిల్లా ప్రజల్లో నెలకొంది.



కబ్జాల్లో కొన్ని..

☛ గుజరాత్‌కు చెందిన సత్యసాయి బాబా భక్తులకు కొత్తచెరువు మండలం మైలేపల్లి ప్రధాన రహదారి వద్ద 153-2లో 9.6 ఎకరాల భూమి ఉంది. ఈభూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.15 కోట్లు పలుకుతోంది. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి నకిలీ యజమానిని సృష్టించి, పేరు మార్చి, అధికారులను ఏమార్చి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం గతేడాది అక్టోబరులో వెలుగులోకి వచ్చింది. ఈ భూమిని కొట్టేయడానికి వైసీపీ నేతలు భూయజమాని తాన్‌సేన్‌ను తాన్‌సేష్‌గా నకిలీ యజమానిని సృష్టించి అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న అసలు యజమాని కొత్తచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికార పార్టీ ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ నడవగా.. నకిలీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే వత్తాసు పలికారు. ఇందులో అధికార పార్టీ నేతల రంగ ప్రవేశంతో రెవెన్యూ అధికార యంత్రాంగం నేటికీ ముగింపు పలకకపోగా.. వివాదం కొనసాగుతోంది.

☛ బుక్కపట్నం జాతీయ రహదారి 342 పక్కనే బసవేశ్వరస్వామి దేవాలయానికి చెందిన రూ.10 కోట్ల విలువచేసే 4.20 ఎకరాల మాన్యం భూమిని కబ్జా చేసేందుకు గతేడాది నవంబరులో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి స్కెచ్ వేశాడు. రెవెన్యూ అండదండలతో రాత్రికిరాత్రే చదును చేసి, ఆక్రమణకు యత్నించగా వామపక్ష నాయకులు గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దేవదాయ శాఖ రంగప్రవేశం చేసింది. ఈ భూములను ఎలాగైనా కబ్జా చేసేందుకు నేటికీ పావులు కదుపుతున్నారు.

☛ గతేడాది జూలైలో హిందూపురంలో అనంతపద్మనాభస్వామి ఆలయం నానెప్ప సత్రానికి చెందిన సర్వే నంబరు 29-ఎం7, 30-ఎం1లో 2.50 ఎకరాల రూ.20 కోట్ల విలువచేసే భూమిని ఆక్రమించేందుకు అధికార పార్టీ నేతలు స్కెచ్ వేశారు. ఆలయానికి భూమి దానమిచ్చిన నానెప్ప వారుసుల పేరుతో చిలమత్తూరుకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధితో పాటు మరికొందరు తమకు విక్రయించినట్లు అగ్రిమెంట్లతో భూమి చదును చేస్తుండగా.. ఏకంగా దేవదాయ శాఖకు చెందిన అధికారి ప్రెస్‌మీట్ పెట్టి భూ ఆక్రమణను అడ్డుకున్నారు. దేవదాయ శాఖ బోర్డులు నాటినా పలుమార్లు వాటిని తొలగించారు. అయినా ఈ భూమిని వైసీపీ నేతలు కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు.





☛ పుట్టపర్తిలో కరణం రామకృష్ణకు చెందిన రూ.50 కోట్ల విలువచేసే 18.30 ఎకరాల భూమిని అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో కరణం సుబ్రహ్మణ్యేశ్వరరావు, పులివెందుల వాసి అవుకు రమనాథ రెడ్డి, పుట్టపర్తికి చెందిన మరికొందరు కాజేయాలని చూస్తున్నారని తమ్ముడు కరణం చంద్రశేఖర్ రావు డిసెంబరులో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన అన్న ఫొటోగానీ, ఆధార్‌కార్డుగానీ లేకుండా ఫోర్జరీ సంతకాలతో ఆయన కుమారుడు కరణం నాగతేజ సంతకాలు కూడా లేకుండా నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు. నకిలీ పత్రాల అడ్రస్ ఆధారాలతో కోర్టును సైతం తప్పుదోవ పట్టించి, అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రోద్బలంతో, అధికారులపై ఒత్తిళ్లతో వన్‌బీ పాసుపుస్తకాలు సైతం పొందినట్లు ఫిర్యాదు చేశారు.

☛ ముదిగుబ్బ మండల కేంద్రం పరిధి దొరిగిల్లు రహదారిలో 1330-1 సర్వే నంబరులో కోట్ల రూపాయల విలువచేసే నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి ఆక్రమించి, రెవెన్యూలో సక్రమం చేసుకున్నారు. ప్లాట్లుగా వేసి దర్జాగా అమ్మేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

☛ కదిరి పట్టణ పరిధి సర్వే నంబరు 206లో రూ.1.5 కోట్ల విలువ చేసే భూమిని దర్జాగా కబ్జాచేసి, నిర్మాణాలు చేపడుతున్నారు.

బరితెగింపు

వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులకు తిలోదికాలివ్వడంతో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలకు ఆదాయ వనరులు లేకుండా పోయాయన్న వాదన రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తోంది. నాలుగున్నరేళ్లపాటు వేచిచూసినా.. ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదు. పైగా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ నిధులు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, అసైన్డ్, పోరంబోకు, వివాదాల భూములపై వైసీపీ ప్రజాప్రతినిధులతోపాటు నేతల కన్ను పడింది. జగనన్న లేఔట్లలో ప్లాట్లు, ఓపెన్ స్థలాలు, ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు అక్రమించి అమ్మేస్తున్నారు. లేఔట్లు వేసి దోచేస్తున్నారు. రెవెన్యూ అధికార యంత్రాంగం వాటిని సక్రమం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. లేఔట్‌లో ప్లాటు సెంటు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు, ఖాళీ స్థలమైతే రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వంతున విక్రయిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, దళారులు ఎవరికివారు వీలున్న చోటల్లా ఇష్టారాజ్యంగా ప్రభుత్వ, ఖాళీ స్థలాలను అక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఆశీస్సులు ఉండడంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఇటు ప్రభుత్వ భూముల్లో పాగా వేయడంతోపాటు అటు సామాన్యుల పట్టా భూములను సైతం బలవంతంగా లాగేసుకుంటున్నారు. భూవివాదాలకు తెరలేపి బోగస్ పత్రాలు పుట్టించి రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూ ములను అక్రమిస్తున్నా భూరాబందులకు అధికార యంత్రాంగం గొడుగు పట్టి, తోడ్పాటు అందిస్తున్నట్లు విమర్శలు న్నాయి. వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతల ప్రమేయం ఉన్నందున బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొందరు అధికార పార్టీ నేతలు రియల్ మాఫియా బృందాలుగా ఏర్పడి, వివాద, అసైన్డ్ భూములు, స్థలాలను అన్వేషిస్తూ గుర్తిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసో, నకిలీ ప్రతాలు సృష్టించి అమ్మేస్తున్నారు.

మెగా డీఎస్సీ పేరుతో మోసం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



పెనుకొండ, ఫిబ్రవరి 1: అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ ఐదేళ్లు పట్టించుకోకుండా తీరా ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో 18,520 టీచర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా.. 8,388తో సరిపెట్టారన్నారు. తాజాగా 6,100 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రిమండలి నిర్ణయించడం మెగా మోసానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు డీఎస్సీ ప్రకటించి మరో మోసానికి తెరలేపారని మండిపడ్డారు. ఐదేళ్లుగా నిరుద్యోగులను పట్టించుకోని జగన్‌రెడ్డి.. ఇప్పుడు వారిపట్ల కపట ప్రేమ ఒకలబోస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత జగన్ మాయలోపడి మోసపోవద్దని సూచించారు. జగన్‌రెడ్డికి అన్నిదారులు మూసుకుపోయాయనీ, ఓటమికి చేరువలో ఉన్నాడన్నారు.

సరికొత్త జగన్నాటకం: సవిత

పెనుకొండ టౌన్: ఎన్నికల వేళ డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ ముఖ్యమంత్రి జగన్ సరికొత్త జగన్నాటకానికి తెరలేపారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత విమర్శించారు. స్థానిక తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. జగన్ అధికారం చేపట్టిన నాలుగేళ్ల పదినెలల కాలంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఊసెత్తలేదన్నారు. ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారన్నారు. అబద్ధాలు, మోసాలు, వంచనకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్ ఎన్నికల ముందు 23 వేల ఖాళీలున్నాయనీ, మెగా డీఎస్సీ ఇస్తానని హామీ గుప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారన్నారు. చివరకు ప్రజాగ్రహానికి గురై ఇంటికి వెళ్లే ముందు 6100 పోస్టులు భర్తీ చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. 2021-22నాటికి ఏపీలో 50వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 12,386 పాఠశాలలు ఒక ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

హిందూపురం: మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఓట్ల కోసం 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ముందు 6100 పోస్టులతో సరిపెడతామంటే ఒప్పుకునేది లేదన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

50వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

- జనాభాకు అనుగుణంగా మునిసిపల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి
- బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి
- ఏపీటీఎఫ్ డిమాండ్.. పుట్టపర్తిలో ధర్నా

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్రవ్యాప్తంగా ఖళీగా ఉన్న 50 వేల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు గురువారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. 6100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించడం సరికాదన్నారు. 50 వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేయాలని కోరారు. వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి టీచర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మునిసిపల్ టీచర్ల సర్వీస్‌రూల్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. టీచర్లకు అన్నిరకాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ధర్నాలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, సబ్‌కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, అంజినమూర్తి, వెంకటనారాయణరెడ్డి, బలరాముడు పాల్గొన్నారు.



↑ మాట్లాడుతున్న అశోక్‌కుమార్

సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఫిబ్రవరి 1: సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీకి ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మీనాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అర్హులన్నారు. గతంలో సస్పెండైన వారు, ఏపీ సమగ్రశిక్షలో పనిచేస్తూ సరెండర్ అయిన వారు అనర్హులని తెలిపారు. గతేడాది డిసెంబరు 31 నాటికి 50 ఏళ్ల వయసు ఉండాలన్నారు. ప్రతి పోస్టుకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతపరచని దరఖాస్తులను తిరస్కరిస్తామని డీఈఓ వివరించారు. **పోస్టుల వివరాలు:** ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్, ప్లానింగ్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు.



పోలీసులు, గోనుగుంట అనుచరుల మధ్య తోపులాట

పలువురికి గాయాలు

గోనుగుంట్లను అరెస్టు చేసే క్రమంలో పోలీసు వాహనానికి అడ్డుపడిన ఆయన అనుచరులకు గాయాలయ్యాయి. పోలీసులు పిడిగుద్దులు గుద్దారంటూ వారు ఆరోపించారు. గోనుగుంట్ల అనుచరుడు తారక్‌తోపాటు పలువురికి గాయాలయ్యాయి.

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల ధ్వజం

- ధర్మవరంలో రోడ్డు మరమ్మతులకు ఉపక్రమణ
- అడ్డుకున్న పోలీసులు
- వాగ్వాదం.. తోపులాట
- గోనుగుంట్ల అరెస్టు

రోడ్లు వేస్తామంటే.. అడ్డుకుంటారా?

ధర్మవరం, ఫిబ్రవరి 1: గుంతలమయమైన పట్టణంలోని ప్రధాన రహదారులకు సొంత నిధులతో మరమ్మతులు చేయాలని వస్తే పోలీసుల ద్వారా అధికార పార్టీ అడ్డుకోవడం ఏంటని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మండిపడ్డారు. ఎన్నిసార్లు విన్నవించినా.. అధికారులు రోడ్లు వేయరనీ, తాము వేస్తామన్నా అడ్డుకోవడం సరికాదన్నారు. పట్టణంలో గుంతలమయమైన ప్రధాన రహదారుల మరమ్మతులకు గోనుగుంట్ల గురువారం ఉపక్రమించడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గోనుగుంట్ల.. రోడ్లు, భవనాల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గుంతలను పూడ్చకపోతే తానే సొంత నిధులతో చేయిస్తానని గతనెల 16న ఆర్అండ్‌బీ అధికారులకు లేఖ అందజేశారు. అయినా స్పందించకపోవడంతో 24న గోనుగుంట్ల.. ఆ శాఖ ఎస్ఈని కలిసి, సమస్యను వివరించారు. వారంలోగా గుంతలను పూడ్చుతామని ఎస్ఈ హామీ ఇచ్చారు. వారంలోగా ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే తానే సొంత ఖర్చులతో రోడ్లు వేస్తానంటూ గోనుగుంట్ల ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు స్పందించలేదు. దీంతో గురువారం రోడ్డు మరమ్మతులకు అవసరమైన సామగ్రితో గోనుగుంట్ల పట్టణంలోని మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని, అడ్డుకున్నారు. దీంతో గోనుగుంట్ల, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి అభివృద్ధి పనులను ఎలా అడ్డుకుంటారంటూ పోలీసులపై గోనుగుంట్ల అనుచరులు మండిపడ్డారు. మార్కెట్‌యార్డు వద్ద రెండున్నర గంటల పాటు రణరంగాన్ని తలపించింది. తర్వాత పోలీసులు.. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణను అరెస్టు చేసి, తరలిస్తుండగా అనుచరులు అడ్డుపడ్డారు. దీంతో తోపులాట తలెత్తింది. చివరికి గోనుగుంట్లను ధర్మవరం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యే దివాలా కోరుతనానికి నిదర్శనం

ప్రజాసమస్యలను సొంత డబ్బుతో పరిష్కరిస్తామంటే ఎమ్మెల్యే కేతిరెడ్డి పోలీసుల ద్వారా అడ్డుకోవడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమని గోనుగుంట్ల మండిపడ్డారు. గుడ్‌మార్నింగ్ పేరుతో దోచుకునే వ్యక్తికి ప్రజాసమస్యలు ఎలా తెలుస్తాయంటూ ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్లలో గుంతలు పూడ్చలేని ఎమ్మెల్యే తాము పనులు మొదలుపెట్టే సమయంలో శంకుస్థాపన చేయడం శోచనీయమన్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రూ.4కోట్లతో రోడ్డు పనులు చేస్తామంటూ గురువారమే హడావుడి చేయడం గమనార్హం.



టూటౌన్ స్టేషన్‌లో గోనుగుంట్ల

29 మందిపై కేసులు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణతోపాటు మరో 29 మందిపై పట్టణ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించారన్న నెపంతో కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

కేతిరెడ్డి అక్రమాలకు హద్దేలేదు..

రోజుకొకటి బయట పడుతున్నాయ్
కోట్ల రూపాయల భూములు కాజేస్తున్నారు
పరిటాల శ్రీరామ్



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 1: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అక్రమాలకు హద్దేలేదనీ, రోజుకొకటి బయటపడుతున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మండలంలోని రేగాటిపల్లి సొసైటీ భూములను పరిటాల రవీంద్ర హయాంలో 900 మంది పేదలకు పంచారన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ భూమిలో 300 ఎకరాలు ఇళ్ల స్థలాలకు కేటాయించారన్నారు. ఆ తరువాత కేతిరెడ్డి 2012లో ఎమ్మెల్యేగా ఉండగా మళ్లీ భూపంపిణీ చేశారన్నారు. అప్పటికే అక్రమాలపై టీడీపీ, స్థానిక నేతలు పోరాడారన్నారు. గతంలో సోలార్ భూములు కూడా ఇలానే లాక్కున్నారని ఆరోపించారు. కేతిరెడ్డి చెప్పినవన్నీ చేస్తూ తహసీల్దార్లు, వీఆర్వోలు, సిబ్బంది సస్పెండ్ అవుతున్నారన్నారు. వైసీపీ నాయకులు కాజేసిన భూములను టీడీపీ అధికారంలోకి రాగానే స్వాధీనం చేసుకుని, ప్రజలకు దక్కేలా చేస్తామన్నారని, అక్రమాలకు పాల్పడినవారు జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో మొక్కల పెంపకం మాటున భారీగా అవినీతి చేస్తున్నారన్నారు. ఒక్కో పంచాయతీలో కోటి రూపాయల దాకా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. చనిపోయిన వారి పేర్లతో నేటికీ ఉపాధి బిల్లులు జమవుతున్నాయనీ, అవి ఎవరికి చేరుతున్నాయో ఆయా గ్రామాల్లో అందరికీ తెలుసన్నారు. ప్రజల కోసం అధికార పార్టీపై పోరాడుతున్న వారిపై రౌడీషీట్లు, పీడీ యాక్టులు పెడుతున్నారని మండిపడ్డారు. చిన్నిచిన్న విషయాలకు కూడా పీడీ యాక్టులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు వైసీపీ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. కోర్టులకు వెళ్తే బలయ్యేది పోలీసులేనన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. తంబాపురం సర్పంచ్ జయచంద్రారెడ్డి తమ పార్టీ నాయకులపై దాడి చేయడం పద్ధతి కాదన్నారు.

బడుగులకు రాజ్యాధికారం పంచింది టీడీపీనే

వైసీపీలో కార్పొరేషన్లు పెట్టి కుర్చీ కూడా ఇవ్వలేదు
బీసీలకు న్యాయం చేకూరాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిందే
పురం జయహో బీసీ సదస్సులో నాయకులు

హిందూపురం, ఫిబ్రవరి 1: స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బడుగులకు రాజ్యాధికారం పంచింది టీడీపీయేనని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. హిందూపురంలోని ఆర్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఉదయం హిందూపురం పట్టణం, రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీలు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆర్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకుని జ్యోతిబా పూలే, అంబేడ్కర్, ఎన్టీఆర్, చిత్రపటాలకు పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. అనంతరం సదస్సులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బడుగుల కోసం టీడీపీ ఆవిర్భవించిందన్నారు. అప్పటి వరకు కొన్ని వర్గాలకే పరిమితమైన రాజ్యాధికారాన్ని ఎన్టీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచారన్నారు. 1983 ముందు, ఆ తరువాత చూస్తే చట్టసభల్లోకి బలహీనవర్గాలవారు ఎంత మంది అడుగు పెట్టారో అర్థం అవుతుందన్నారు. అదేబాటలో నారా చంద్రబాబు నాయుడు బీసీలకు ప్రత్యేక పీట వేశారన్నారు. 24శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 34 శాతానికి పెంచారన్నారు. రాష్ట్రం బాగు పడాలన్నా, పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా అనుభవం కలిగిన చంద్రబాబు సీఎం కావాలని అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. సూపర్-6 పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, హిందూపురం నియోజకవర్గ పరిశీలకుడు నరసింహులుయాదవ్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శులు కొల్లకుంట అంజనప్ప, రామాంజనమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్, పట్టణాధ్యక్షుడు రమేష్, నేతలు దేమకేతేపల్లి అంజనప్ప, చంద్రమోహన్, హెచ్ఎన్ రాము, గాండ్ల బాలాజీ, గాండ్ల విశాలక్షి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

కాసింతే ఊరట..!



● వెనుకబడిన జిల్లా ప్యాకేజీ లేదు
● సెంట్రల్ వర్సిటీకి నిధులు లేవు
● వేతన జీవులకూ తప్పని నిరాశ
● రైతాంగానికి సబ్సిడీ నానో డీఏపీ
● గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్

అనంతపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు పిసరంత ఊరట మాత్రమే దక్కింది. రైతాంగం పట్ల కనికరం చూపలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలు చేస్తామని ప్రకటించారేగాని.. బడ్జెట్‌లో ఊసు లేదు. రైతులకు సబ్సిడీతో నానో డీఏపీ ఇస్తామని ప్రకటించడం ఊరట. ఉమ్మడి జిల్లాలో కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఉపాధి పథకానికికి బడ్జెట్‌లో అరకొర కేటాయింపులే జరిగాయి. విభజన హామీలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన సెంట్రల్ యూనివర్శిటీకి నిధులు కేటాయింపు పట్ల కేంద్రం చొరవ చూపలేదు. ఇప్పటికీ సెంట్రల్ యూనివర్శిటీ ప్రహరీకే పరిమితమైంది. వేతన జీవులు ఆశించిన ఆదాయ పన్ను మినహాయింపు పెరగలేదు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ రూపొందించారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు వ్యాఖ్యానించారు. సోలార్ విద్యుత్ 300 యూనిట్ల వరకూ (ఇళ్లపై ఏర్పాటు) ఉచితంగా ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఆయూష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవల వర్తింపు ఆ వర్గాలకు కొంత ఉపశమనం కలిగిస్తుంది. మధ్యతరగతి ప్రజలు సొంత గృహాలను కొనుగోలు చేసేందుకు, నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'హౌసింగ్ ఫర్ మిడిల్‌క్లాస్' పథకాన్ని ప్రారంభించేందుకు బడ్జెట్‌లో రూపకల్పన చేశారు.

వైసీపీ వైఫల్యం..



రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయింది. విభజన హామీలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు సాధించుకోవడంలో వైసీపీ ఘోరంగా విఫలమైంది. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సాధించుకోవడంలోనూ, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తహా ప్యాకేజీ పొందడంలోనూ వైఫల్యాన్ని చాటుకుంది. బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో... సీఎం జగన్ తన పార్టీ ఎంపీలతో సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సింది. కానీ పట్టించుకోలేదు. ప్రత్యేక హోదా మాటను పూర్తిగా మరిచిపోయారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెట్టారనడానికి బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం.

- కాలవ శ్రీనివాసులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు

రిక్తహస్తమే..



లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ ఇది. ప్రజల ఆశలను వమ్ము చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. పెద్దగా కేటాయింపులు లేవు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా నిధులు కేటాయింపులున్నాయి. విభజన హామీలు అమలుకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వలేదు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఊసే ఎత్తలేదు. అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ నిరాశపరిచింది.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

వెనుకబడిన ప్రాంతాలకు మోసం...



వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర బడ్జెలో లేవు. ఆ వర్గాలను మోసం చేసే బడ్జెట్ ఇది. బీజేపీ నాయకులు రాయలసీమ డిక్లరేషన్, రాయలసీ గర్జన అంటూ ఇక్కడ రంకెలు వేస్తుంటారు. కానీ ఢిల్లీ బీజేపీ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడం లేదు. విభజన చట్టం హామీల్లో భాగంగా రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్లు మూడు సంవత్సరాలు మాత్రమే ఇచ్చి నిలిపివేసింది. ఎనిమిది సంవత్సరాల క్రితం జిల్లాలో శంకుస్థాపన చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇప్పటికీ ప్రహరీ గోడలు, పునాదులకే పరిమితమైంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనులు నత్తతో పోటీపడుతున్నాయి. ఆ డివిజన్‌ను బలహీనపరిచే చర్యలు అమలవుతున్నాయి. కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్ల గురించి ప్రస్తావనే లేదు. రాయలసీమ జిల్లాలో నెలకొల్పాల్సి కేంద్ర సంస్థలు, అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్, టెక్స్‌టైల్స్ పార్కు, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూలో రూ. 400 కోట్లతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ వంటి హామీలలో బీజేపీ ఒక్కటీ పూర్తి చేయలేదు. ఈ బడ్జెట్‌లో 99 శాతం ప్రజలకు ఎలాంటి ఉపశమనం లేదు. బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలింది. నిరుద్యోగులకి తీవ్ర అన్యాయం జరిగింది. ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయి. ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానిలాంటి బడా కార్పొరేట్లకు కట్టబెట్టడంలో ఈ ప్రభుత్వం జయప్రదమైంది. అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి, అణచడానికి మతాన్ని అడ్డంగా పెట్టుకొని రామనామస్మరణతో ప్రజల్ని మాయ చేయాలని చూస్తున్నారు.

- రాంభూపాల్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పరిశోధన విద్యకు పెద్దపీట



దేశప్రగతికి మూలమైన పరిశోధన, సృజనాత్మక విద్యకు కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించారు. యువత, మహిళలకు ముద్రాయోజన, స్టార్టప్‌లతో ఉద్యోగాలు, రైతులకు బీమా సౌకర్యం, ఆర్థిక సాయం, పాడి రైతులకు ప్రోత్సాహకం, రైల్వే కారిడార్‌లు, ఇళ్ల నిర్మాణాలు.. ఇలా అన్ని రంగాలను సమన్వయం చేస్తూ నిధులు కేటాయించారు. ఇవి ఆర్థికాభివృద్ధికి సూచికలు. అన్ని వర్గాల ప్రజల సగటు ఆదాయం పెంచుకునేలా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయం.

- సాకే శివశంకర్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రైతాంగానికి నిరాశ..



సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలను, రైతాంగాన్ని ఈ బడ్జెట్ నిరాశపరిచింది. ఏ వర్గానికీ ప్రయోజనం చేకూరేదిగా లేదు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. కార్పొరేట్ శక్తులకు మరింత ఎదగడానికి ఊతమిచ్చేలా బడ్జెట్ రూపొందించారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఊసెత్తలేదు.

- బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

కరువు జిల్లాపై వివక్ష..



కరువు జిల్లాపై కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతోంది. విభజన హక్కులను సాధించుకోవడంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కొనసాగింది. అత్యంత వెనుకబడిన జిల్లాకు నిధులను సాధించుకోవాలన్న చిత్తశుద్ధి జగన్ ప్రభుత్వానికి లేకుండాపోయింది.

- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

బండి భరోసా లేదు

● రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి ● కొత్త రైళ్లు, ప్రాజెక్టులు నిల్
● రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశ ● డబ్లింగ్, ట్రాక్ పనులకు అరకొర నిధులు



బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులపై మాట్లాడుతున్న డీఆర్ఎం వినీత్ సింగ్

గుంతకల్లు, ఫిబ్రవరి1: రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయే మిగిలింది. కొత్త రైళ్ల ఊసులేదు. ఉద్యోగులు, కార్మికులకు వరాలు లేవు. కొత్త ప్రాజెక్టులు అసలే లేవు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌లో రైల్వే శాఖకు నిరాశే మిగిల్చింది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అనూహ్యమైన ప్రకటనలేవీ ఉండకపోవచ్చని ముందే భావించినా, కనీసం తాయిలాలన్నా ఉంటాయని ఆశించిన రైల్వే ఉద్యోగులకు నిరాశే మిగిలింది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సరుకు రవాణాకు అనుకూలంగా రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై తప్ప ఇతరాత్రా ప్రయోజనాలేవి కలిగించలేదు. మొత్తానికి ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్టులో రైల్వే శాఖకు మొండి చేయి దక్కిందన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

డబ్లింగ్‌కు పెద్దపీట

సరుకు రవాణా ద్వారా రైల్వేకు పెంపొందించడానికి అనుకూలంగా ఈ రైల్వే బడ్జెట్‌లో లైన్ల డబ్లింగ్, ట్రిపులింగ్‌లకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. రైల్వే డివిజన్‌లోని గూడూరు-రేణిగుంట, రేణిగుంట-తిరుపతి సెక్షన్లలో అదనపు లైన్ కోసం బడ్జెట్‌లో రూ. 5.50 కోట్లను కేటాయించారు. గుత్తి బైపాస్‌లైన్, ధర్మవరం-పాకాల-కాట్పాడి సెక్షన్‌లో డబ్లింగ్ కోసం, అకోలా-డోన్ లైన్ డబ్లింగ్‌కు అరకొరగా నిధులను కేటాయించారు. గుత్తి-పెండేకల్లు లైన్ డబ్లింగ్‌కు రూ. 150 కోట్లు, గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్ డబ్లింగ్‌కు 20 కోట్లు కేటాయించారు. గుత్తి-ధర్మవరం, కల్లూరు-గుంతకల్లు లైన్ల అభివృద్ధికి తక్కువ పరిమాణంలో నిధులను కేటాయించారు.


కొత్తలైన్లకు నిధులు

నంద్యాల-ఎర్రగుంట్ల, కడప-బెంగళూరు, నడికుడి-శ్రీకాళహస్తి లైన్ల నిర్మాణానికి నిధులను ఇచ్చారు. అలాగే కంబం-ప్రొద్దుటూరు మధ్య 125 కి.మీ.ల లైన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోనూ, గుత్తిలోని మూడు ప్లాట్‌ఫారాల అనుసంధానానికి నిధులను కేటాయించారు. ధర్మవరం స్టేషన్‌లో 6వ ప్లాట్‌ఫారం అభివృద్ధికి నిధులు కేటాయించారు. డివిజన్‌లోని 100 లెవెల్ క్రాసింగ్‌లకు విద్యుదీకరణకు, తిరుపతి-రేణిగుంట-గూడూరు సెక్షన్‌లోని 94 లెవెల్ క్రాసింగ్‌లకు నిధులను కేటాయించారు. గుంతకల్లు-హైదరాబాదు, గుంతకల్లు-సికింద్రాబాదు రూట్లలోని లెవెల్ క్రా సింగ్‌లకు ఇంటర్లాకింగ్ పనులకు నిధులు కేటాయిం చారు. గుంతకల్లు డివిజన్‌లో 95 టాయిలెట్లు, నీటి వసతి ఏర్పాటుకు ఫండ్స్ ఇచ్చారు. గుంతకల్లులోని ఎలెక్ట్రికల్ లోకో షెడ్ పూర్తికి రూ. 4.8 కోట్ల నిధులను కేటాయించారు. గుంతకల్లు డీజల్ షెడ్‌లో హైపవర్ లోకోల మరమ్మత్తు స్థాయిని 50 లోకోలకు పెంచడానికి నిర్ణయించారు.

అసంతృప్తిలో ఉద్యోగులు

కేంద్ర బడ్జెట్‌లో తమకు ఏదైనా తీపికబురు ఎదురౌతుందని ఆశించిన రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైంది. ఓపీఎస్ విషయంపై ఎటువంటి ఊసూ లేకపోవడం, 8వ పే రివిజన్ కమిషన్ విషయంగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం, ఇతర ప్రయోజనాలకు సంబంధించి కూడా ఎటువంటి చర్చ లేకపోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. రైల్వేలో ఖాళీలు, పెరిగిన రైళ్లకు అనుగుణంగా పెంచాల్సిన ఉద్యోగాల విషయంపై బడ్జెట్‌లో ప్రకటన లేకపోవడంపై కార్మిక సంఘాలు నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. కనీసం ఎన్నికల ముందైనా తమ కష్టాలు తీరేలా వరాలు ప్రసాదిస్తారని భావించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. వరుసగా రెండో ఏడాదీ ఉద్యోగులకు మొండి చేయే మిగిలింది. రైల్వే పింక్ బుక్ వెలువడిన తర్వాత సునిశితంగా పరిశీలించి రైల్వే డివిజన్‌కు ఎన్ని కోట్ల కేటాయింపులు జరిగాయో ప్రకటిస్తామని గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్ పేర్కొన్నారు.

కర్నూలు కార్పొరేటర్‌కు నింబగల్లులో ఓటు



నింబగల్లులో నమోదైన కర్నూల్ కార్పొరేటర్ ఓటు

ఉరవకొండ, ఫిబ్రవరి 1: కర్నూలు మున్సిపల్ కార్పొరేటర్ అయిన కృష్ణకాంత్ సోంపల్లికి అధికారులు నింబగల్లులో ఓటు హక్కు కల్పించారు. గ్రామంలోని 147వ పోలింగ్ కేంద్రంలో అతనితో పాటు, అతని కుటుంబ సభ్యులకూ ఓట్లు నమోదు అయ్యాయి. ఆయన గ్రామాన్ని వదిలి వెళ్లి 15 ఏళ్లు అవుతున్నా వాటిని తొలగించకపోవడం చర్చనీయాంశమయ్యింది. కర్నూలు పట్టణం లోని 44వ పోలింగ్ కేంద్రంలోనూ అతనికి ఓటు ఉంది. ప్రజా ప్రతినిధి అయిఉండి, రెండు చోట్ల ఓట్లు నమో దు చేసుకోవడంపై పలువురు మండిపడుతున్నారు. బీఎల్‌ఓపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామంలో ఉన్నా.. తొలగించారు



తొలగించిన ఓటు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో నివాసముంటున్నా ఓటును తొలగించారని వండ్రక్క కుటుంబ సభ్యులు ఆరోపి స్తున్నారు. 98వ పోలింగ్ కేంద్రంలో వండ్రక్కకు ఓటు హక్కును కల్పించారు. అయితే అధికారులు ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని వారు మండిపడ్డారు. ప్రతి ఎన్నికల్లోనూ ఆమె ఓటు వేసిందని, గ్రామంలో ఉండగానే ఓటును తొలగించడంపై వారు ఆగ్రహం చేస్తున్నారు.

తప్పుల తడకగా తుది ఓటరు జాబితా

ముదిగుబ్బ: గత మూడు, నాలుగు నెలల నుంచి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, ఇంటింటా సర్వేలు నిర్వహించి ఓటరు జాబితాలో తప్పులు సరిచేశామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎటువంటి మార్పు జరగలేదని ఇటీవలే విడుదలైన ఓటరు తుది జాబితాతో స్పష్టమవుతోంది. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని రాజకీయ పార్టీల నాయకులు బీఎల్వోలతో పాటు తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. కొత్త జాబితాలోనూ తిరిగి అవే తప్పులు దొర్లుతున్నాయి. తుది జాబితాలో మండల కేంద్రంలోని 68వ పోలింగ్ కేంద్రంలో ఖాశీం కల్లూరి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అదే పోలింగ్‌కేంద్రంలో ఈరూరి చిన్న ముస్కిన్ కూడా గత ఏడాది మృతి చెందాడు. అయితే వారి ఓట్లు ఓటరు జాబితాలో తొలగి పోలేదు. ఇవే కాకుండా 68వ బూత్‌లో దాదాపు10 ఓట్లు వరకు మరణించిన వారివి ఉన్నాయని రాజకీయ పార్టీల నాయకులు వాపోతున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఏఈ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ (కూర్చున్న వ్యక్తి)

గుత్తి, ఫిబ్రవరి 1: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేందుకు లంచం తీసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వజ్రకూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రైతు ఆనంద్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలంటే రూ.30 వేలు లంచం ఇవ్వాలని ఏఈ చంద్రశేఖర్ డిమాండ్ చేశాడు. దీంతో రూ.20 వేలు ఇచ్చేందుకు రైతు ఒప్పుకుని, ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు ఏఈ చంద్రశేఖర్‌కు గురువారం ఫోన్ చేశాడు. గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నానని, అక్కడికి వచ్చి లంచం డబ్బులు ఇవ్వాలని ఏఈ సూచించాడు. గుత్తి బస్టాండులో రైతు ఆనంద్ ఏఈకి డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏఈ చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని గుత్తి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో 'అనంత' హవా

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1: దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో అనంతపురం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా గత నెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్‌లో సౌత్ ఇండియా నుంచి ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా నాలుగు ప్రాజెక్టులు పాల్గొనగా రెండు ప్రాజక్టులకు 4వ స్థానం, మరో 2 ప్రాజెక్టులకు ప్రత్యేక బహుమతులు వచ్చాయి. బుధవారం వాటికి సంబంధించిన ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఇతర ప్రముఖుల నుంచి విద్యార్థులు, టీచర్లు బహుమతులు, జ్ఞాపికలను అందుకున్నారు. గుత్తికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థులు బెన్నీ, మహేంద్రరెడ్డి గైడ్ టీచర్ శామ్యూల్ ప్రతాప్ సహాయంతో తయారు చేసిన "కవచ్ అండ్ రైల్వే లైట్స్ విత్ బ్లూటూత్" అన్న ప్రాజక్టు గ్రూప్ విభాగంలో, కసాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి హేమసాగర్ తన గైడ్ టీచర్ నారాయణ సహాయంతో తయారు చేసిన "జామెట్రీ డ్రివెన్ ఎకో టాయిలెట్" అన్న ప్రాజెక్టు 4వ స్థానంలో నిలిచి సత్తా చాటినట్లు తెలిపారు. అదేవిధంగా కరుట్లపల్లి జడ్పీహైస్కూల్‌కు చెందిన టీచర్ మహమ్మద్‌రఫీకి టీచర్ కేటగిరీలో, పుట్లూరు జడ్పీహైస్కూల్ 9వ తరగతి విద్యార్థి అనూహ్యరెడ్డి తన గైడ్ టీచర్ రాజేశ్వరి సహకారంతో విద్యార్థి కేటగిరీలో స్పెషల్ ప్రైజ్‌లు పొందారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రతిభను ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు అభినందించారు.



పలువురు ఎస్ఐలు వీఆర్‌కు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 1: జిల్లాలో పలువురు ఎస్ఐలను వేకెన్సీ రిజర్వ్‌డ్(వీఆర్)కు పంపుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఐదుమంది ఎస్ఐలను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ పరిధిలోకి వీఆర్‌కు తీసుకెళ్లారు. అనంతపురం వన్‌టౌన్ ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు, అనంతపురం ట్రాఫిక్ ఎస్ఐలు కె.ధరణిబాబు, జి.దిలీప్‌కుమార్, కూడేరు యూపీఎస్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ, దిశ మహిళా పీఎస్ ఎస్ఐ జి.సుధాకర్ యాదవ్‌లను వీఆర్‌కు పంపారు.

సిమెంట్ బస్తాల ఐచర్ వాహనం మాయం

నగరంలోని బళ్లారి బైపాస్‌లో 250సిమెంట్ బస్తాలున్న ఐచర్ వాహనం మాయమైంది. కొన్ని గంటల వ్యవధిలోనే ఆ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు రామ్మోహన్ అనే ఐచర్ వాహన యజమాని, డ్రైవర్ గురువారం ఉదయం తాడిపత్రి నుంచి ఐచర్‌లో 250ప్యాకెట్ల సిమెంట్ బస్తాల లోడుతో అనంతపురం వచ్చాడు. బళ్లారి బైపాస్‌లో వాహనం ఆపి హమాలీల కోసం వాహనం దిగి ముందుకెళ్లాడు. అదనుచూసిన దొంగ ఆ వాహనంలోకి ఎక్కి పరారయ్యాడు. బాధితుడు నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిఘా ఉంచి మిగిలిన పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. కొన్ని గంటల్లోనే పెద్దవడుగూరు సమీపంలో పోలీసులకు ఆ దొంగ వాహనంతో పాటు అడ్డంగా దొరికిపోయాడు. ఆరా తీస్తే వాహనం తీసుకెళ్లిన వ్యక్తి గుత్తికి చెందిన భాస్కర్‌గా తేలింది.

కలెక్టరు కారును ఢీకొన్న ఆటో



దెబ్బతిన్న కలెక్టర్ వాహనం

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 1: శ్రీసత్యసాయి జిల్లాకేంద్రంలోని సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద కలెక్టర్ వాహనాన్ని ఆటో ఢీకొంది. గురువారం సాయంత్రం కలెక్టర్ అరుణ్‌బాబు తన క్యాంపు కార్యాలయానికి కారులో వెళ్తుండగా.. వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో కారు కుడివైపు భాగం పాక్షికంగా దెబ్బతింది. కలెక్టర్ వాహన డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ మోహన్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.

నేటి నుంచి హంపి ఉత్సవాలు

ప్రారంభించనున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య

హొస్పేట/బళ్లారి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధిచెందిన కర్ణాటకలోని హంపి ఉత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను సుమారు రూ. 14 కోట్ల వ్యయంతో నిర్వహించనున్నారు. ఉత్సవాలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం ప్రధాన వేదిక నుంచి ప్రారంభించనున్నారు. ఉత్సవాలకు మొత్తం నాలుగు వేదికలను ఏర్పాటు చేశారు. ఎదురు బసవన్న, కడ్లే గణపతి, వారాల మండపం తదితర ప్రధాన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. తొలి రోజు సిద్దరామయ్య ప్రధాన వేదికను ప్రారంభించి, ప్రసంగిస్తారు. వేడుకల నేపథ్యంలో హంపి అంతటా సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో పట్టణం వెలిగిపోతోంది. గురువారం సాయంత్రం వసంత ఉత్సవాలు జరిగాయి. హెలికాప్టర్ రైడ్‌నూ కూడా ప్రారంభించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు, కళాకారులతో హంపి కిటకిటలాడుతోంది. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ దివాకర్ తెలిపారు.



హంపిలో సిద్ధమైన వేదిక

డీఎస్పీల బదిలీ

అనంతపురం క్రైం/ పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 1: అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి బదిలీ అయ్యారు. బుధవారం అర్ధరాత్రి రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డిని మదనపల్లి డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మార్కాపురం డీఎస్పీగా విధుల్లో ఉన్న జి.వీర రాఘవరెడ్డిని నియమించారు.

● శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డీఎస్పీ జి.హుస్సేన్ పీరాను 'అప్పా' డీఎస్పీగా నియమిస్తూ, పీటీసీకి అటాచ్ చేశారు. గుంతకల్లు డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న జి.శివ భాస్కర్‌రెడ్డిని నియమించారు. తూర్పుగోదావరి జిల్లాలో సెబ్ అండ్ డీసీఆర్బీలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులును దిశ శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులిచ్చారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పను ఎక్కడికీ బదిలీ చేయలేదు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా రాంబాబు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 1: అమలాపురం ఎక్సైజ్ ఏఈఎస్‌గా పనిచేస్తున్న రాంబాబుకు ఉద్యోగోన్నతి కల్పించి నగరంలోని ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా నియమించారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎంఎల్ డిపోలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ హోదాలో పనిచేస్తున్న రామమోహన్‌రెడ్డికి ఇటీవల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆయన్ను నంద్యాల సెబ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

● పార్టీ శ్రేణులకు జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి పిలుపు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి1: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేద్దామని జడ్పీమాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. తొలుత మండల ప్రచారకమిటీని ఎంపికచేశారు. అనంతరం మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేసి పరిటాలశ్రీరామ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కష్టపడిన వారిగి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్ చౌదరి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, నాయకులు తలారి వెంకటలక్ష్మి, విజయసారథి, గొట్లూరుశ్రీనివాసులు, రాఘవరెడ్డి, ముచ్చురామిక్రిష్ణ, జంగంనరసింహులు, గరుడంపల్లి అంజి, చంద్రశేఖర్, బిల్లేశీనా, మల్లేనిపల్లి చంద్ర, గొట్లూరు అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటింటా ప్రచారం

మండలవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఇంటింటా టీడీపీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. తొలుత మల్లేనిపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభిస్తామని కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న తెలిపారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

కోవెలగుట్టపల్లిలో బావిష్యత్తుకు గ్యారెంటీ



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండలంలోని కోవెలగుట్టపల్లెలో గురువారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేస్తూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి. వాటి వల్ల ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. జగన్‌రెడ్డి అరాచకపాలన ఇక వద్దని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నారప్ప, నరసింహులు, వెంకటేష్, రామకృష్ణ, అంజనేయులు, చెన్నప్ప, వెంకటరాముడు, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడివాల ఈశ్వరుడి జయంతి

ధర్మవరం, ఫిబ్రవరి 1: రజకుల ఆరాధ్యదైవం మడివాల ఈశ్వరుడు(మడివాల మాచి దేవుడు)జయంతిని పట్టణంలో గురువారం శ్రీసత్యసాయిజిల్లా రజక సాధికార కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పేదలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రజక సాధికార కమిటీ కన్వీనర్ మాల్యావంతం నారాయణస్వామి, సభ్యులు నరేంద్ర, మస్తాన్, కొత్తకోట రామాంజనేయులు, సాకే అక్కులప్ప, సాకే వెంకటేశ్, గొడ్డుమర్రి రాజు, తుంపర్తి వెంకటేశ్, ఇందుకూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

కదిరి అర్బన్, ఫిబ్రవరి 1: పార్టీపేరు చెప్పుకుని దందాలకు పాల్పడుతున్న రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని ఆర్‌ఆర్ కాలనీకి చెందిన ప్రజలు ఆర్డీవో వంశీకృష్ణకు గురువారం వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ కదిరి రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 83లో 2007వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పేదలకు కాలనీ ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు కేటాయించిందన్నారు. అయితే చాలామంది స్థోమతలేక ఇళ్లు కట్టుకోలేదని, జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోయారని తెలిపారు. కాగా ఆ కాలనీ పక్కన ప్రస్తుతం బైపాస్‌రోడ్డు రావడంతో ఆ స్థలాల ధరలు పెరిగాయన్నారు. దీంతో కొందరు ఆర్సీపీ పేరుతో కాలనీలో ఉన్న అమాయకులను బెదిరించి స్థలాలను తమ పేరుతో రాయించుకోవడానికి ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కాలనీవాసులు నారాయణ, సరస్వతి, పద్మావతి, లక్ష్మీనరసమ్మ, నాగరత్నమ్మ, సరోజమ్మ, సరస్వతి తదితరులు కోరారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకుంటాం: టీడీపీ

మడకశిర టౌన్, ఫిబ్రవరి1: నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పర్య టనకు వస్తున్నారని టీడీపీ జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్ జయకుమార్ అన్నారు. అమరాపురంలో శుక్రవారం మంత్రి పర్యటనను అడ్డ కుంటామని పేర్కొన్నారు. వారు గురువారం అమరాపురం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో ఒక్క చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం చేపట్టారా అంటూ ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో హంద్రీనీవా కాలువలనుంచి నీరు సరఫరా చే యడంలో విఫలమయ్యారన్నారు. అమరాపురం నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రో డ్డు వేస్తామని చెప్పి ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. రైతు ప్రభుత్వం అని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం కనీసం నియోజకవర్గంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పెటించారా అన్నా రు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వడంలో వైసీపీ ప్రభు త్వం పూర్తిగా విఫల మైందన్నారు. మరి మంత్రి పెద్దిరెడ్డి ఏ మొహం పెట్టుకొని నియోజకవర్గ పర్యటన కు వస్తున్నారని అన్నారు. అందుకే మంత్రి పర్యటనను అడ్డుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కదిరి, ఫిబ్రవరి 1: అమడగూరు మండలంలోని వెంకటనారాయణ పల్లిలో మహిళలకు వడ్డెర్ల సంక్షేమసంఘం నాయకులు జెరిపిటి క్రిష్ణమూర్తి , దళవాయి వెంకటనారాయణ, సిమెంటు పోలన్న తదితరులు గురువారం చీరలు పంపిణీ చేశారు. సుమారు ఐదువందల మంది మహిళలకు వాటిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని వారికిభరోసా కల్పించడానికి గ్రామంలో పర్యటించామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం: పల్లె

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 1: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన దీక్ష గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ దీక్షకు మాజీ మంత్రి పల్లె సంఘీభావం తెలిపి మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు ఇంటిపట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే ప్రమాద బీమా వర్తింప చేస్తామన్నారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీరాములతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పల్లె వెంట మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, రాష్ట్ర బీసీసెల్ నాయకులు జెరిపిటి అంజనప్ప, జిల్లా మైనార్టీ నాయకులు మండోజీ ఆర్ఫీఖాన్, జాకీర్ అహమ్మద్, పొగాకు షబ్బీర్, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు సౌదీ నాగరాజు, క్రిష్ణ, ఎం.శ్రీనివాసుల తదితరులు ఉన్నారు.



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

వైసీపీది అరాచక పాలన: పల్లె

● ఆయన ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పల్లె రఘునాథ రెడ్డి



పరాకువాండ్లపల్లిలో కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న ఇతర పార్టీల నాయకులు



కదిరిలో టీడీపీలోకి చేరిన వారితో కందికుంట

కదిరి, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వానిది అరాచక పాలన అని, ఆ పాలనతో ప్రజలు విసిగి పోయారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి విమర్శించారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో గురువారం టీడీపీ సమావేశం జరిగింది. ఇందులో కసముద్రం, నిలువురాతి పల్లెకు చెంది 50 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లె వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి తప్ప ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. అభివృద్ధి పనులు మచ్చుకైనా జరగలేదన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గత ఎన్నికలో ఇచ్చిన హామీలను పూర్తి చేయకుండానే మరోసారి 193 చెరువులకు నీరు నింపుతానని పాదయాత్ర చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనను భరించలేకనే ప్రజలు, నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తిమిరికుంటపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులును ఆయన పరామర్శించి, ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు పార్థసారధి రెడ్డి, నాగేంద్ర రెడ్డి, ఆంజనేయులు, టైలర్ జయరాం, నారాయణస్వామి, కమ్మల భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కందికుంట ఆధ్వర్యంలో 35కుటుంబాలు చేరిక

తనకల్లు: మండలంలోని పరాకువాండ్లపల్లి గ్రామంలో సుమారు 35కుటుంబాల వారు బీజేపీ, వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన సమక్షంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. ఈ ప్రాంతంలో సీజీ ప్రాజెక్టుకు అధికారికంగా హంద్రీనీవా నీటిని కేటాయించి, ప్రతియేడాది నీటిని నింపేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇమామ్‌లు, మౌజన్లకు ఇళ్లు కట్టిస్తామన్నారు. వైసీపీ పాలనలో ఎవరికీ రక్షణ లేదన్నారు. ప్రత్యేకించి దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాల వారు దోపిడీకి గురవుతున్నట్లు చెప్పారు. మద్య నిషేధంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీశ్రేణులకు సూచించారు. అలాగే చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరం కలిసి కట్టుగా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. పార్టీలోకి చేరిన వారిలో బీజేపీ నాయకుడు రెడ్డెప్పరెడ్డి, వైసీపీ నాయకులు రామాంజులరెడ్డి, నాగిరెడ్డి, వంశీకృష్ణ, ఫయాజ్, తాజ్‌తోపాటు 35కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, బంగారు కృష్ణమూర్తి, కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేశాయి ప్రభాకర్‌రెడ్డి, విదురశేఖర్‌రెడ్డి, బాగేపల్లి చలపతి, శంకర్‌నాయుడు, మునెప్ప, రాజారెడ్డి, దస్తగిరి, మహబూబ్‌బాషా, సరోజమ్మ, శోభా, రాజశేఖర్‌బాబు, చిన్నప్ప, చంద్రప్ప, హరినాయక్, శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని పట్నం పంచాయతీ వీరుపల్లి పేట, ఎట్టిగడ్డతండాకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కడువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో శాంతు, వంశీ, నారాయణస్వామి, నరేష్, మధు, గంగులప్ప, కృష్ణ, అంజనప్ప, వెంకటేష్‌నాయక్, శాంతనాయక్, శంకర్‌నాయక్, మునేనాయక్, రాజశేఖర్, సాయిప్రకాష్, పెద్దలక్ష్మీనాయక్, లక్ష్మేనాయక్, రమణనాయక్ తదితరులు ఉన్నారు.

కదిరి: పట్టణంలోని 23వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు కిరణ్‌షౌకత్, ఆయన తమ్ముళ్లు లియాకత్, ఇర్షాద్, సమీర్ తదితరులు గురువారం టీడీపీలో చేశారు. స్థానిక 23వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారందరికీ కందికుంట వెంకటప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డైమండ్ ఇర్షాన్, అల్తాముస్తఫా, ఇనాయత్, అహమ్మద్ అలీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ పోస్టులు పెంచాలి'



ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి1: అదిగో డీఎస్సీ.. ఇదిగో డీఎస్సీ.. అంటూ ఊరించి నాలుగున్నర ఏళ్ల తర్వాత తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల చెవిలో పువ్వుల పెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న విమర్శించారు. డీఎస్సీ పోస్టులు పెంచాలని గురువారం ఆయన నాయకులతో కలిసి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీని అన్నారు. కేవలం 6100పోస్టులను విడుదల చేయడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రమేష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు హరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాలనాగార్జున తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసగిస్తున్న సీఎం'

కదిరిఅర్బన్ : ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల జీవితాలతో ఆడకుంటున్నారని టీడీపీ జిల్లా అధికారప్రతినిధి వల్లెపు సోముశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రతిపక్షనాయకుడిగా పాదయాత్ర చేస్తూ.. అధికారంలోకి రాగానే ప్రతియేటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా.. ఇంతవరకు ఒక్క డీఎస్సీ నిర్వహించిన పాపాన పోలేదన్నారు. దీనికితోడు పాఠశాలల విలీనంపేరుతో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఆయన నిర్వాకంతో చాలా గ్రామాల్లో పాఠశాలలు మూతపడ్డాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే.. కేవలం 6,100 మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు మరోమారు నిరుద్యోగులను మోసం చేయడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని, నిరుద్యోగ యువత జగన్ మాటలకు మోసపోవద్దని సూచించారు.

అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలుగుయువత మండలాధ్యక్షుడు హరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఈడీ, డీఈడీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం ఐదేళ్లుగా ఎదురు చుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయకుండా కేవలం 6,100పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. వెంటనే ఖాళీ పోస్టున్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రిజర్వాయర్‌లో పడి ఉపాధ్యాయుడి మృతి



మహేంద్రరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 1: కదిరి మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌లో పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందారు. ఘటనపై రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లమాడ మండలం బాసంవారిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి, వెంకటరమణమ్మ దంపతులకు మహేంద్రరెడ్డి (32), ఇద్దరు కుమార్తెలు సంతానం. మహేంద్రర్‌రెడ్డి అమడగూరు మండలం గుండువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అతను రోజూ స్వగ్రామంలోని ఇంటినుంచి ద్విచక్రవాహనంలో విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అయితే రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అని సెల్‌కు ఫోన్ చేశారు. ఫోన్ ఎంతసేపటికీ తీయకపోవడంతో ఆందోళన చెందిన వారు బంధువులు, తెలినవారిని ఆరా తీశారు. ఈనేపథ్యంలో బుధవారం ఉదయం చెర్లోపల్లి రిజర్వార్ వద్ద మహేంద్రరెడ్డి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, క్యారియర్ ఉన్నట్లు గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు రిజర్వాయర్ వద్దకెళ్లి స్థానికులతో కలిసి ఆ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం రిజర్వాయర్‌లో మృతదేహం తేలినట్లు తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే వచ్చి మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం కదిరిప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి తండ్రి రామకృష్ణారెడ్డి తమ కొడుకు బహిర్భూమికెళ్లి ప్రమాదవశాత్తూ రిజర్వాయర్‌లో పడి మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నంజప్పనాయుడు (ఫైల్)

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 1: మండలంలోని తుమ్మలకుంట్లపల్లి గ్రామానికి చెందిన నంజప్పనాయుడు(65) విద్యుత్‌దాఘాతంతో గురువారం మృతిచెందాడు. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంజప్పనాయుడు వృత్తిరీత్యా వ్యవసాయ కూలీ. కాగా ఇదే మండలంలోని తూవంకపల్లికి చెందిన రైతు వెంకటరామిరెడ్డి నంజప్పనాయుడుకు ఫోన్ చేసి తమ పొలంలో విద్యుత్‌లైన్ తెగి పడిందని, తీగలు లాగడానికి రావాలని కోరాడు. దీంతో ఇద్దరు కలిసి విద్యుత్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా ఉన్న వైరు నంజప్పనాయుడుకు తగిలింది. దీంతో షాక్ గురైన అతడు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్‌నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



హర్షవర్ధన్ (ఫైల్‌ఫొటో)

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని వెంగళమ్మచెరువులో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళమ్మచెరువుకు చెందిన గంగప్ప కుమారుడు హర్షవర్ధన్ (27)ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అయితే అతడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా.. ఏవీ కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతను గురువారం మధ్యాహ్నం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పుట్టపర్తి జనరల్ హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తనకల్లు, ఫిబ్రవరి 1: మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న సాయికుమార్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అలాగే అతడి వద్ద నుంచి 125 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నల్లచెరువు, ఫిబ్రవరి 1: మండలకేంద్రంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక బసవన్న కట్టవద్ద తహసీల్దార్ రవికుమార్ తదితరులు ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అలాగే వేసిన ఓటు ఏ పార్టీ అభ్యర్థికి పడిందో తెలుసుకోవడంపై కూడా వివరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న చలో అసెంబ్లీ

తాడిమర్రి, ఫిబ్రవరి 1: రాష్ట్రంలోని పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 6వతేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్లభూషణ్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ... పంచాయతీ రాజ్‌కు సంబంధించిన రూ.8660 కోట్లు నిధులు దారి మళ్లించారని, వాటిని తిరిగి ఇవ్వడంతో పాటు సర్పంచ్‌లకు సంబంధించిన 16 న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

కుష్ఠుపై అవగాహన

ముదిగుబ్బ, ఫిబ్రవరి1: మండలంలోని దొరిగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై రాగి రంగులో స్పర్శలేని మచ్చలు, స్పర్శ లేని కణతులు, ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అవి డబ్బులు కాదు.. మందులు!'

కదిరి, ఫిబ్రవరి 1 : పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ఉద్యోగి లంచం తీసుకుంటున్నట్లు గురువారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. అయితే అవి డబ్బులు కాదు మందులని సబ్‌రిజిస్ట్రార్ చెప్పుకొచ్చారు. వివరాల్లోకెళ్తే.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రోజూ అనేక మంది వస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఆ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ప్రతి పనికి డబ్బు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈసీలు, రిజిస్ట్రేషన్ అయిన తరువాత పత్రాలు, నఖలు, ఆర్‌హెచ్, స్టాంపింగ్‌లు తదితర వాటి కోసం క్రయ, విక్రయదారులు వస్తుంటారు. వాటికి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాల్సి ఉంటుంది. అయితే దీంతో పాటు అదనంగా డబ్బు చెల్లిస్తేనే పత్రాలు బయటకు వస్తున్నాయని, లేదంటే నెలల తరబడి వేచి ఉండాల్సిందేనని క్రయ,విక్రయదారులు చెబుతున్నారు. ఈకార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి పనిమీద వచ్చిన వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు గురువారం సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. వంద నోటు ఇచ్చిన తరువాత సదురు ఉద్యోగి పత్రాలను కొనుగోలు దారులకు ఇవ్వడమూ కనిపిస్తోంది. అయితే దీనిపై సబ్ రిజిస్ట్రార్ శిరీషను వివరణ కోరగా.. అది డబ్బు కాదని, మందులని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే అందరూ చూస్తుండానే లంచాలు వసూలు చేయడంపై పలువురు అశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం జరుగుతున్నట్లు క్రయ, విక్రయదారులు ఆరోపిస్తున్నారు.



డబ్బులు తీసుకుంటున్నట్లుగా సోషల్ మీడియాలో వచ్చిన ఫొటో

మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్‌కుమార్

కదిరి, ఫిబ్రవరి 1: కదిరి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. పలమనేరులో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసినట్లు తెలిసింది. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీహరిబాబు అనంతపురం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తనకల్లు, ఫిబ్రవరి 1: మండలంలోని తొట్లివారిపల్లి గ్రామంలో గణేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ రాజశేఖర్ గురువారం తెలిపారు. తొట్లివారిపల్లిలో గణేష్‌తోపాటు మహబూబీ గొర్రెల కాపరులుగా జీవనం సాగిస్తున్నారు. కాగా గణేష్‌కు చెందిన పొట్టేళ్లు మహబూబీ మందలోకి వెళ్లాయి. ఈవిషయంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆవేశానికి లోనైన మహబూబీ, ఆమె కుమారుడు మహబూబ్ బాషా గణేష్‌పై చెప్పులతో దాడి చేసి కులం పేరుతో దూషించారు. ఈ విషయంపై గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

వాహనాల తనిఖీ

తనకల్లు, ఫిబ్రవరి 1: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో గురువారం రాత్రి కదిరి డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో తనకల్లు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను నిలిపి ఆర్సీలు, డ్రైవింగ్‌లైసెన్స్‌లు చెక్ చేశారు. అనంతరం ఆమె కొక్కంటి క్రాస్‌లో సమీపంలో ఉన్న సమస్యాత్మక గ్రామమైన చంద్రబాబుకాలనీని సందర్శించారు. ఆమె వెంట ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

పండ్లచెట్లు దగ్ధం

తాడిమర్రి, ఫిబ్రవరి 1: మండలంలోని పూల ఓబయ్యపల్లిగ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి పొలంలోని పలు రకాల పండ్ల చెట్లు గురువారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతయ్యాయి. పొలంలో అల్లనేరేడు, మామిడి, టేకు చెట్లు అన్నీ కలిపి సుమారు 30 దాకా దగ్ధమయ్యాయి. అలాగే రెండెకరాలలోని డ్రిప్ పరికరాలు కూడా కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్లనే ఇలా జరిగి ఉంటుందని బాధితుడు వాపోయారు. డ్రిప్ పరికరాలను తోటలో నుంచి తొలగించి ఒక చోట కుప్పగా వేశానని, అవన్నీ కాలిపోయాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి పల్లె పరామర్శ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని గంగిరెడ్డిపల్లి తండాలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన టీడీపీ కార్యకర్త రామన్న కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం చేశారు.

రైస్ మిల్లు యజమానిపై పీడీయాక్టు

నల్లమాడ, ఫిబ్రవరి 1: చౌకధాన్యపు బియ్యంను అక్రమంగా కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తున్న రైస్‌మిల్ యజమాని బెల్లం రంగారెడ్డి , అతని కుమారుడు జయచంద్రారెడ్డిపై పోలీసులు పీడీయాక్టు కేసు నమోదు చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి, అతని కుమారుడు జయచంద్రారెడ్డిపై పీడీయాక్టు కేసు నమోదు చేశామని, అనంతరం వారిని కడప సెంట్రల్ జైలుకు తరలించామని చెప్పారు.

ఏపీజీబీ రీజనల్ మేనేజర్‌గా రమేష్

కదిరి, ఫిబ్రవరి 1: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ కదిరి రీజనల్ మేనేజర్‌గా టీ.రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ కృష్ణంరాజు నాయక్



బాధ్యతలు చేపట్టిన సీఐ కృష్ణంరాజునాయక్

ముదిగుబ్బ, ఫిబ్రవరి1: ముదిగుబ్బ సీఐగా కృష్ణంరాజు నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ యతీంద్ర ముదిగుబ్బ మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సీఐ కృష్ణంరాజునాయక్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిగుబ్బ సర్కిల్‌లోని గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా యతీంద్ర బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 1: మండలంలోని కొండకమర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో అధికారి రామసూరారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని ఫీడర్లను మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఆయా ప్రజలు సహకరించాలని కోరారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయండి: టీడీపీ

చిలమత్తూరు, ఫిబ్రవరి 1: టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరుపతలపెట్టిన జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ కొడికొండ బాలాజీ తదితరులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో మసీదు పక్కన ఈ సభ నిర్వహిస్తామని తెలిపాన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథితో పాటు మరికొంత మంది బీసీ నాయకులు పాల్గొంటారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యాన్ని కేవలం టీడీపీ ఒక్కటే కల్పించిందన్నారు. బీసీలకు అన్ని రకాలుగా పెద్ద పీట వేసిన తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ అండగా ఉండాలని, బీసీ వర్గానికి చెందిన ప్రతి ఒక్కరు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీసీలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విజయ్ మృతదేహం

లేపాక్షి, ఫిబ్రవరి 1 : బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే ఓ యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ షరుఫుద్దీన్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... చిలమత్తూరు మండలం వడ్డిచెన్నంపల్లికి చెందిన పూజారి వెంకటాద్రి కుమారుడు విజయ్(22) బేల్దారికి పనిచేస్తూ కుటుంబానికి తోడుగా ఉండేవాడు. అతడు గురువారం ఉదయం లేపాక్షి మండలపరిధిలోని చోళసముద్రం గ్రా మంలో భవన నిర్మాణం కోసం కూలి పనికి వచ్చాడు. నీళ్ల వేసేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. అతడిని వెంటనే 108లో హిందూపురం తరలించగా అప్పటికే మృతిచెం దినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ కోసం వస్తూ వృద్ధుడు...

గోరంట్ల, ఫిబ్రవరి 1: నల్లమాడ మండలంలోని సానేవారిపల్లికి చెందిన ముద్దగుల వెంకటరాముడు(70) గోరంట్ల బస్టాండ్ కూడలిలో అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. అతడు గురువారం ఒకటో తేదీ కావడంతో బెంగుళూరు నుంచి వృద్ధాప్య పింఛన్ కోసం స్వగ్రామానికి వెళ్తున్నాడు. గోరంట్ల బస్టాండ్‌లో బస్సుకోసం వేచి ఉన్నసమయంలో అస్వస్థతకు గురయ్యాడు. రోడ్డు పక్కనున్న టీకొట్టులో పనిచేసే హనుమంతు అతడి కోరిక మేరకు తాగడానికి నీరు ఇచ్చి, సమీపంలోని పంచాయతీ నూతన భవనం వద్దకు చేర్చాడు. చికిత్స కోసం 108కి సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. అయితే వృద్ధుడు అప్పటికే మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. మృతుడి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా హోమ్‌గార్డు నాగభూషణకు, బెంగుళూరులోని పెద్దకుమారుడు గంగప్పకు సమాచారం అందించారు. గంగప్ప బెంగళూరులో ఉపాధి కోసం వెళ్లి సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. తానే తండ్రిని పోషిస్తున్న ట్లు చెప్పాడు. శుక్రవారం గ్రామానికి వెళ్లొద్దామని చెప్పినా, తండ్రి వినకుండా తానొక్కడే బస్సులో బయలు దేరి వచ్చినట్లు తెలిపాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, గోరంట్లలో మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశాడు.

మల్బరీ షెడ్డులో వ్యక్తి మృతి

అతిగా మద్యం తాగి అంటున్న గ్రామస్థులు


రాజకుమార్ మృతదేహం

లేపాక్షి, ఫిబ్రవరి 1 : మండలపరిధిలోని శిరివరం గ్రామంలో ఉన్న ఓ మల్బరీ షెడ్డులో బుధవారం రాత్రి ఓ వ్యక్తి లేవలేని స్థితిలో పడిఉన్నట్లు గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించి అతడు అప్ప టికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల మేరకు... శిరివరం పంచాయతీ తిరుమల దేవరపల్లికి చెందిన కురుబ నారాయణమ్మ కుమారుడు రాజకుమార్(34) శిరివరంలో మల్బరీ షెడ్డులో పురుగుల పెంపకానికి కూలీగా పనిచేస్తున్నాడు. తోటి కూలీలతో కలిసి బుధవారం పనికి వెళ్లాడు. అయితే ఒకే రోజు నాలుగైదుసార్లు మద్యం తాగి షెడ్డులో పడుకున్నాడు. సాయంత్రం 6గంటల సమయంలో కూలీలు ఎంత లేపినా లేవలేదు. దీంతో అనుమానం వచ్చి వారు చుట్టు పక్కల వారికి తెలిపారు. గ్రామస్థులు రాత్రి 10గంటల సమయంలో 100కి ఫోన్‌చేసి సమాచారాన్ని అందించారు. శిరివరం ఇన్‌చార్జ్ కానిస్టేబుల్ గంగాధర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, రాజ్‌కుమార్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అధికంగా మద్యం తాగినందుకే మృతి చెందినట్లు గ్రామస్థులు చర్చించుకున్నారు. రూరల్ సీఐ వేణుగోపాల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పై అంతస్తు నుంచి పడి గోరంట్ల వాసి...


మహేష్‌రెడ్డి (ఫైల్)

గోరంట్ల, ఫిబ్రవరి 1: మండలంలోని ఎగువ గంగంపల్లికి చెందిన పప్పూరి మహేష్ రెడ్డి (42) బెంగళూరులో భవనం పై అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. అతడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఎగువ గంగంపల్లికి చెందిన పప్పూరి రామిరెడ్డి కుమారుడైన మహేష్‌రెడ్డి కొంతకాలంగా బెంగళూరులోని ఓ ప్రయివేటు కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య శశికళ, కుమారైతో కలిసి నగరంలో నివాసముంటున్నాడు. తండ్రి మరణించాడు. అతడు తరచూ వచ్చిఎగువ గంగంపల్లిలో ఉన్న తల్లి రామలక్ష్మమ్మ యోగక్షేమాలు తెలుసుకునే వాడు. బుధవారం బెంగళూరులో నిర్మాణంలో ఉన్న ఐదో అంతస్తును పరిశీలిస్తున్న సమయంలో కాలుజారి మూడో అంతస్తుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే బెంగుళూరులోని అపోలో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి రామల క్ష్మమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఎగువగంగంపల్లి, కొండిరెడ్డిపల్లిల్లో వీరి బంధువులు అధిక సంఖ్యలో ఉండడంతో వారు బెంగళూరు నుంచి వస్తున్న మృతదేహం కోసం రాత్రి పొద్దుపోయేవరకు వేచి ఉన్నారు.

రెండున్నరేళ్లుగా అభివృద్ధి జాడలేని పురం


పూడిపోయిన డ్రైన్‌ను చూపుతున్న కౌన్సిలర్ రోషన్ ఆలీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 1: హిందూపురం మునిసిపాలిటీ అంటేనే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఏ 1 మునిసిపాలిటి అయిన హిందూపురానికి తెలుగుదేశం పార్టీ హయాంలో స్వచ్ఛ మునిసిపాలిటీగా అవార్డు కూడా దక్కింది. అలాంటి మునిసిపాలిటీలో వైసీపీ అధికారం చేపట్టాక ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జరుగలేదనే విమర్శ పట్టణంలో కోడై కూస్తోంది. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి మునిసిపల్ చైర్ పర్సన్ రావిళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలో ఎంతగానో అభివృద్ధి జరిగింది. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో డ్రైన్లు, రోడ్లు ఎంతో అభివృద్ధి చెందాయని పట్టణ ప్రజలు అంటున్నారు. అయితే వైసీపీ పాలనలో ప్రస్తుత చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో అభివృద్ధా


ప్రధాన రహదారి పక్కన దెబ్బతిన్నడ్రైన్‌లో ఇరుక్కున్న కారు (ఫైల్)

అసహనం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

ఇటీవల సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

అంటే ఏమిటి అనే విధంగా పాలన సాగుతోందని వైసీపీ కౌన్సిలర్లే మాట్లాడుకోవడం విశేషం. గత నెల 28వ తేదీన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో సాక్ష్యాత్తు వైసీపీ కౌన్సిలర్లే చైర్ పర్సన్ పోడియం వద్దకు వెళ్లి పట్టణంలో అభివృద్ధిపై ఆమెను నిలదీశారు. హిందూపురంలో 38 వార్డులున్నాయి. అన్ని వార్డులకు మీరు చైర్‌పర్సన్. రెండున్నరేళ్లుగా వార్డుల్లో పనులు జరుగలేదు. ప్రజలకు మేమేమి జవాబు చెప్పా లని నిలదీశారు. పోడియం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. హిందూపురం లో కొంతమంది(మగ్గురు కౌన్సిలర్లు)కి మాత్రమే కోట్ల రూపాయల పనులు అలాట్ చేశారని, మిగిలిన కౌన్సిలర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

20 ఏళ్లలో ఇంత అధ్వాన పరిస్థితి చూడలేదు

నేను 20 ఏళ్ల నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుస్తూనే ఉన్నా. గతంలో నేనే నా వార్డులో అభివృద్ధి చేయడంతో ప్రజలు ప్రతిసారి నన్ను ఆదరిస్తున్నారు. నేను తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కౌన్సిలర్‌గా ఎన్నో పనులు మా వార్డులో చేపట్టాను. ప్రస్తుతం వైసీపీ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచాను. ఇప్పటి వరకు మా వార్డులో ఏ అభివృద్ధి పనులు జరుగలేదు. నిత్యం వేలాది మంది సంచరించే ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి, నా వార్డు పరిధిలోకే వస్తుంది. ఇక్కడ డ్రైను పూర్తిగా మూసుకుపోయింది. దుర్వాసన వెదజ ల్లుతోంది. ముక్కు మూసుకుని అటుగా వెళ్లాల్సి వస్తోంది. ప్రధాన రహదారిలో పెద్ద గుంతలా డ్రైను ఏర్పడింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఒక వృద్ధుడు పొరపాటున అందులో పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గుమనించి ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా ఓ కారు ఆ డ్రైనులో పడిపోయింది. ఇలా ప్రమాదాలబారిన పడి ప్రాణాలు పోకముందే డ్రైన్‌ను పూర్తి చేయాలని రెండున్నరేళ్లుగా ప్రతి కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్‌కు, అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాను. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంత అధ్వాన పాలన నా 20 ఏళ్ల అనుభవంలో ఎన్నడూ తారసపడలేదు.

- రోషన్‌అలీ, 29వ వార్డు కౌన్సిలర్

రోడ్డు ప్రమాద బాధితుడి మృతి

నివాళులర్పించిన టీడీపీ నాయకులు


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సవిత, నాయకులు

రొద్దం, ఫిబ్రవరి 1 : మండలపరిధిలోని చిన్నకోడిపల్లికి చెందిన ముగ్గురు స్నేహితులు గత యేడాది ఆగస్టు 12న భోళాశంకర్ సినిమాకు వెళ్తూ పావగడ సమీపంలోని కడుమలకుంట గేటులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అందులో ఇద్దరు చనిపోగా... చాకలి రాము(17) అనే వ్యక్తి కోమాలోకి వెళ్లాడు. అతడు గురువారం ఉదయం 4గంటల సమయంలో గ్రామంలోని ఇంట్లో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ఐదున్నరనెలల కాలంలో బెంగళూరు, అనంతపురం ఆసుపత్రుల్లో వైద్యానికి సుమారు రూ.45లక్షల వరకు ఖర్చు అయినట్లు బంధు వులు వివరించారు. అతడి తండ్రి పరమేశప్ప 15 ఏళ్ల క్రితమే మృతిచెందగా తల్లి జయమ్మ రామును పెంచి పోషించింది. వృత్తే జీవనాధారంగా ఉన్న కుటుంబానికి దిక్కుమొక్కు ఎవరూ లేకపోవ డంతో మృతుడి తల్లి రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్ చిన్నకోడిపల్లికి వేర్వేరుగా వెళ్లారు. భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, వీరాంజనేయులు, హనుమంతు, హరీష్, నాగరాజు, అశ్వత్థ, గంగాధర్, ఇమాం, సానిపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బేల్దారి మృతి


సిర్రప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 1 : మండలంలోని కొండంపల్లి వద్ద కొత్తచెరువుకు వెళ్లే రహదారిలో బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో బుక్కపట్నానికి చెందిన సిర్రప్ప(32) తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బుక్కపట్నం గ్రామానికి చెందిన సిర్రప్ప బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అతడు బుధవారం అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు శేఖర్‌తో కలిసి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో పెనుకొండకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కొండం పల్లి వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం తీవ్రంగా గాయపడిన ఇరువురిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిర్రప్పను మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఉంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 1 : మండలంలోని కురుబవాండ్లపల్లిలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ టీడీపీ నాయకుడు రామాంజనేయులు తండ్రి చిన్న పోతన్న(70) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్ ఆ గ్రామానికి చేరుకుని చిన్నపోతన్న భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు

గ్రామాల్లోకి చొరబడుతున్న వన్యప్రాణులు

గుడిబండ, ఫిబ్రవరి 1 : వర్షాభావ పరిస్థితుల వల్ల అటవీప్రాంతంలో అడవి జంతువులకు నీటి సౌకర్యం కొరవడంది. వాటి సౌకర్యార్థం గతం లో అటవీప్రాంతంలో నిర్మించిన నీటి తొట్టెలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. దీంతో అవి నీటి కోసం పరిసర గ్రామీణ ప్రాంతాల్లోకి చొరబడు తున్నాయి. మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్ గుం డ్లు, మేకలగట్ట, మరుసలపల్లి, కొంకల్లు, పీసీగిరి, బైరేపల్లి, జీఎస్ తండా, రామాయనహట్టి, బూదిపల్లి, కేకాతి, రాళ్లపల్లి, శంకరగల్లు, కడుపులయ్య పాళ్యం, తేదేపాళ్యం, కరేకెర తదితర గ్రామాలు అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. దీంతో అడవి జంతువులు ఆయా గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. దీంతో ప్రజలు రాత్రివేళల్లో ఇంటి నుంచి బయటకు రావడానికి భయాందోళ చెందుతున్నట్లు ఆయా గ్రామాల వాసులు తెలుపుతున్నారు. అటవీశాఖ అధికారులు ఆ తొట్టెలను నీటితో నింపడం లేదని, దీంతో అడవి జంతువులు నీటి కోసం సమీప గ్రామాల్లోకి జొరబడుతున్నాయని అంటున్నారు. దీంతో వ్యవసాయ పొలాలకు రాత్రివేళల్లో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నట్లు రైతులు, ప్రజలు తెలుపుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతంలో నిర్మించిన తొట్టెలకు నీటిని సరఫరాచేసి, అడవిజంతువులు గ్రామాల్లోకి జొరబడకుండా చూడాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.


వట్టెబెట్ట అటవీప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

పురం మునిసిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి



హిందూపురం, ఫిబ్రవరి 1 : పట్టణ మునిసిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు రోజుల క్రితం ఇక్కడ పని చేస్తున్న కమిషనర్‌ను కడపజిల్లా జమ్మలమడుగుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. ఆయనను నాలుగు రోజుల క్రితం రామచంద్రాపురం నుంచి గుడివాడకు బదిలీ చేశారు. నాలుగు రోజులు తిరగకనే అక్కడి నుంచి హిందూపురానికి బదిలీ చేశారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మడకశిరలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

మడకశిర టౌన్, ఫిబ్రవరి1: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలన్నదే మన లక్ష్యం గా సైనికుల్లా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఎన్నికల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లోనే ఉండాలన్నారు. అలాగే ఎన్నికల వరకు ఓటరు జాబితాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. తుది ఓటరు జాబితా ప్రతి ఒక్కరికి అందజేస్తామని తెలిపారు. అందులో నకిలీ ఓట్లను ప్రత్యేకంగా గుర్తించి ఎప్పటికప్పుడు పార్టీ కార్యాలయానికి కానీ, ఎన్నికల సంఘానికి గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి తెలియజేసి బాండ్ రూపంలో రాసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఆర్టీఎస్ కోఆర్డినేటర్ చండడే గంగశేఖర్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ, తెలుగు యువత నాయకులు నాగరాజు, తిమ్మరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, మాజీ కౌన్సిలర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగళి : తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు జరిగేంత వరకు ప్రజలతోనే కలిసి ఉండాలని జడ్పీటీసీ ఉమేష్ సూచించారు. మండలకేంద్రంలోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఓ భవనంలో టీడీపీ ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యూనిట్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఉమేష్ మాట్లాడుతూ... టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ ప్రకటించిన సూపర్-6 పథకాలను వివరించాలన్నారు. ఎన్నికల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లోనే ఉండాలని, గెలుపే లక్ష్యంగా పనిచే యాలన్నారు. ఎన్నికల వరకు ఓటరు జాబితాలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, కుటుంబ సాధికారులు తదితరులకు దిశా నిర్దేశం చేశారు.

గుడిబండ : టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. గుడిబండలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. వైసీపీ అవినీతి అక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో తప్పుల తడకగా ఉన్న వాటిని సరిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం క్లస్టర్ ఇన్‌చార్జ్ బూత్ కన్వీనర్లు, యూనిట్ కుటుంబ సాధికార సారథులు, తదితరులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గేష్, షబ్బీర్, ప్రకాశ్, శివకుమార్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, గుడిపల్లి జయరాం, నజీర్, భోజరాజ్, వెంకటేశ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను అడ్డుకుంటాం

టీడీపీ నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మడకశిర టౌన్, ఫిబ్రవరి1: ని యోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పర్య టనకు వస్తున్నారని టీడీపీ జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్ జయకుమార్ అన్నారు. అమరాపురంలో శుక్రవారం మంత్రి పర్యటనను అడ్డుకుంటామని పేర్కొన్నారు. వారు గురువారం అమరాపురం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో ఒక్క చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం చేపట్టారా అంటూ ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో హంద్రీనీవా కాలువలనుంచి నీరు సరఫరా చేయడంలో విఫలమయ్యారన్నారు. అమరాపురం నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు వేస్తామని చెప్పి ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. రైతు ప్రభుత్వం అని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం కనీసం నియోజకవర్గంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పెటించారా అన్నా రు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫల మైందన్నారు. మరి మంత్రి పెద్దిరెడ్డి ఏ మొహం పెట్టుకొని నియోజకవర్గ పర్యటన కు వస్తున్నారని అన్నారు. అందుకే మంత్రి పర్యటనను అడ్డుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, నాయకులు దాదు, మంజునాథ్, శివకుమార్‌యాదవ్, రామచంద్రప్ప తదితరులు ఉన్నారు.

వసతుల రంగానికి ప్రాధాన్యం హర్షణీయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి

మడకశిర, ఫిబ్రవరి 1: మౌలిక వసతుల రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలో మాట్లాడుతూ... దేశంలో ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాలు, పట్టణాల్లోనూ ఎయిర్‌పోర్టుల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం, అన్ని రైళ్లలో వందే భారత్‌రైలు స్థాయి సౌకర్యాలతో భోగీలను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ పథకం వర్తింపు సంతోష దాయకమన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల్లాంటి చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అందజేయాలని అన్నారు. దేశంలో కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ ఏర్పాటు నిర్ణయం హర్షనీయమన్నారు. విశాఖ రైల్వే జోన్ ఆలస్యానికి కారణం ఏపీ ప్రభుత్వం దానికి అవసరమైన 53 ఎకరాల భూమిని కేటాయించక పోవడమే అనిని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంప దెబ్బ అన్నారు. అయితే ఉపాధిహామీ పథకానికి కేవలం రూ. 86 వేలు కోట్లు కేటాయించారని, అవి ఏ మూలకు సరిపోవన్నారు. ఉపాధిహామీ పథకం విషయంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

కార్మిక సమ్మెను విజయవంతంచేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

హిందూపురం, ఫిబ్రవరి 1 : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య పిలుపునిచ్చారు. ఆయన గురువారం హిందూపురంలో సీపీఐ, రైతు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేమయ్య మాట్లాడుతూ... ప్రధాని మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటిస్తా మంటూ కేంద్ర, కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నారన్నారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, నాలుగు లేబర్‌కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లులు రద్దు చేయాలన్నారు. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వినోద్, శివప్ప, గోవిందరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు మారుతిరెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 1 : పెనుకొండ పంచాయతీలోని మంగాపురంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించి నట్లు పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్ తెలిపారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగాపురంలో గురువారం నుంచి ఏడు రోజులపాటు శుభ్రతా పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. గురువారం గుంతలకు మట్టివేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పర్మిట్లు లేకుండా వాహనాలను నడపరాదు: ఎస్ఐ

గుడిబండ, ఫిబ్రవరి 1 : పర్మిట్లు లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునిప్రతాప్ హెచ్చరించారు. ఎస్ఐ గురువారం సిబ్బందితో కలిసి మండలపరిధిలోని ఫళారం క్రాస్‌వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పర్మిట్లు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం పర్మిట్లులేని వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది రఫీక్ తదితరులు ఉన్నారు.

దేవదాయ శాఖ ఈఓను నియమించండి

అర్చకులు, భక్తుల విజ్ఞప్తి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 1: మడకశిర క్లస్టరుకు సంబంధించి దేవాదాయశాఖ ఈఓను నియమించాలని భక్తులు, అర్చకులు కోరుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ ఆనారో గ్య సమస్యతో గత సంవత్సరం డిసెంబరు నెలలో మృతి చెందారు. అప్పటి నుంచి ఈఓ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ క్లస్టరులో దేవదాయాశాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో అభివృద్ధి పనులు, ఉత్సవాలు జరగాలంటే ఈఓ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఈఓను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలకు జీఓ విడుదల చేయాలి

పారిశుధ్య కార్మికులు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు

హిందూపురం, ఫిబ్రవరి 1 : మునిసిపాలిటీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వెంటనే జీఓ విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మద్దల సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ..... మునిసి పాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. అందుకోసం ఇటీవల డిసెంబర్ 26నుంచి జనవరి 11వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీంతో అప్పుడు ప్రభుత్వం చర్చలకు పిలిచి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. దీనికి సంబంధించిన జీఓలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, గురునాథ్, రామచంద్ర, రామాంజనేయులు, మురళి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.